సాక్షి కామారెడ్డి

మంగళవారం ; 13 ; జూన్ ; 2023



తెగుతున్న బంధాలు!

ఆస్తి తగాదాల కారణంగా అయిన వాళ్లనే హతమారుస్తున్న ఘటనలు జిల్లాలో పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

- 8లో ▸



'ఆరుతడి' సాగుకు సన్నద్ధం

ఖరీఫ్‌లో ఆరుతడి పంటల సాగుకు రైతాంగం సన్నద్ధమవుతోంది. ఇందుకోసం రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
38.3 /28.5

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

- 1,429 మంది విద్యార్థులు హాజరు



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాల్లో 1,529 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. మొదటి రోజు 1,429 విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 100 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్‌కు జిల్లా విద్యార్థులు



దీపిక



జాహ్నవి



అనిల్



మనోజ్

మాచారెడ్డి: స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ 2022–23 సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని అక్కాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.దీపిక, బి.జాహ్నవి, డి.అనిల్, ఎస్.మనోజ్‌లు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మనిషి ప్రమేయం లేకుండా నీటి ట్యాంకును శుభ్రం చేసే యంత్రాన్ని తయారు చేసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వారికి సహకరించిన పాఠశాల గైడ్‌టీచర్ సీహెచ్ సుస్మితను హెచ్‌ఎంతో పాటు గ్రామస్తులు అభినందించారు.

పీజీటీ, టీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో పీజీటీ, టీజీటీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీటీలో జువాలజీ, బోటనీ, ఇంగ్లిష్, తెలుగు–02, అలాగే టీజీటీలో హిందీ, తెలుగు పోస్టులకు పీజీ మరియు బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మంగళ, బుధవారాల్లో డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 18వేల వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు నేరుగా దరఖాస్తుతో పాటు డెమోకు హాజరు కావాలని ఆమె సూచించారు.

రేపటి నుంచి ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం నుంచి 22వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్ రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 800 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కామారెడ్డిలో రెండు, బాన్సువాడలో రెండు మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు.

నేడు నిజామాబాద్ జిల్లాకు కేంద్ర మాజీ మంత్రి రాక

సుభాష్‌నగర్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్ర మాజీ మంత్రి , రాజ్యసభ సభ్యుడు ప్రకాష్‌జవదేకర్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం తరువాత 11 గంటలకు ఆర్మూర్ నియోజక వర్గంలోని క్షత్రియ కళ్యాణ మండపంలో వివిధ మోర్చాల సమావేశానికి హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు నిజామాబాద్ రూరల్ నియోజక వర్గంలోని జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామంలో మోర్చాల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు మాధవనగర్ ఆర్‌వోబీ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటలకు బోధన్‌లోని కేంద్రీయ విద్యాలయం సందర్శిస్తారు. తర్వాత బోధన్‌లో పార్టీ సీనియర్ కార్యకర్తలతో సమావేశంలో పాల్గొననున్నారు.



ప్లాట్ల దందా పల్టీ!

జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్లాట్ల అమ్మకాలు తగ్గిపోయాయి. ఇందుకు ధరలు అడ్డగోలుగా పెరగడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. దానికి తోడు ఏ ప్లాటు వెనుక ఏ వివాదం ఉందోనన్న భయం కూడా జనాన్ని వెనకడుగు వేసేలా చేస్తోంది. దీంతో 'రియల్' దందా పల్టీలు కొడుతుందనే చెప్పాలి.

- ధరలు పెరిగి తగ్గిన క్రయవిక్రయాలు
- భూ వివాదాలు కూడా కారణమే..
- రియల్‌ఎస్టేట్ బిజినెస్‌పై తీవ్ర ప్రభావం

సాక్షి, కామారెడ్డి: మూడు, నాలుగు జిల్లాలకు కూడలిగా ఉన్న కామారెడ్డి పట్టణం వివిధ వ్యాపారాలకు కేంద్రబిందువుగా ఉంటుంది. జిల్లా ఏర్పాటు కాక ముందే ఇక్కడ ప్లాట్ల ధరలు అడ్డగోలుగా పెరిగాయి. జిల్లా అయిన తర్వాత మరింత ఎగబాకాయి. కామారెడ్డిలో ప్లాటు కొనాలంటే ధరలను చూసి జడుసుకునే పరిస్థితి ఏర్పడింది. కరోనా కాలంలో తడబడిన ప్లాట్ల క్రయ విక్రయాలు తర్వాత కోలుకున్నట్టే అనిపించినా, ఇటీవలి కాలంలో అమ్మకాలు తగ్గిపోవడంతో రియల్ రంగంలో ఆందోళన నెలకొంది. ప్లాట్ల కొనుగోళ్లు, అమ్మకాల విషయంలో మధ్యవర్తిత్వం చేస్తూ దాని మీదనే ఆధారపడి బతుకుతున్న చాలామంది ఏజెంట్లు దందా నడవకపోవడంతో కుటుంబాలను పోశించలేక ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి పట్టణంలో గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు లేవని వాపోతున్నారు.

నివాసయోగ్యమైన ప్రదేశంలో ఇంటి నిర్మాణం కోసం ప్లాటు కోసమే రూ. 40లక్షల నుంచి రూ. 50లక్షల దాకా వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణానికి మూడు, నాలుగు కిలోమీటర్ల దూరానికి వెళ్తే రూ. 20లక్షల దాకా వెచ్చిస్తేనే ప్లాటు దొరికే పరిస్థితి ఉంది. సామాన్యుడు ప్లాటు కొనడమే గగనంగా మారింది. డబ్బున్న వాళ్లు మాత్రమే ప్లాటు కొనగలుగుతున్నారు. అయితే కొందరు ఇక్కడ ప్లాటుకు రూ. అరకోటి వెచ్చించేకన్నా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొనడమే బెటర్ అంటూ అటు దారిపడుతున్నారు.

ధరలు ఆకాశంలో..

జిల్లా కేంద్ర పరిధిలోని కామారెడ్డి పట్టణం, దేవునిపల్లి, లింగాపూర్, ఇల్చిపూర్, అడ్లూర్, రామేశ్వర్‌పల్లి, సరంపల్లి, పాత రాజంపేట, టేక్రియాల్ తదితర గ్రామాల పరిధిలో భూముల ధరలు భారీగా పెరిగాయి. పట్టణంలోని వివిధ కాలనీలలో ఇళ్లు కట్టుకునేందుకు ప్లాటు కొనాలంటే సామాన్యుడికి అందుబాటులో లేనంతగా ఎగబాకాయి. ఏ కాలనీకి వెళ్లినా గజం ధర కనీసం రూ. 25వేల నుంచి రూ. 50వేల దాకా నడుస్తోంది. దూరానికి వెళితే రూ. 10వేల నుంచి రూ. 15వేల దాకా పలుకుతుంది.

ధరలతో పాటే పెరిగిన వివాదాలు

జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో భూముల ధరల పెరిగినట్టే వివాదాలు పెరిగాయి. ఒకే ప్లాటుకు రెండు మూడు డాక్యుమెంట్లు తయారవుతున్నాయి. అసలు ప్లాటు యజమాని అమాయకుడైతే చాలు నయానో భయానో బెదిరించి ఎంతకో కొంతకు సెటిల్ చేసుకుంటున్నారు. చాలాచోట్ల ప్లాట్లపై గద్దల్లా వాలుతున్నారు. కొన్ని ముఠాలు రెండో డాక్యుమెంట్లు తయారు చేయించుకుని ఆ భూమి తమదంటూ ఇబ్బంది పెడుతున్నారు. రాజకీయ నాయకుల అండదండలు, అధికారుల సహకారంతో కొందరు ప్లాట్లను కబ్జా చేస్తున్నారు. అన్ని డాక్యుమెంట్లు సరిగ్గానే ఉన్నవారు ఆ ప్లాటు మాదంటూ నోరెళ్లబెట్టుకుంటున్నారు. అయితే ఏది ఉన్నా లీగల్‌గా వెళ్లమంటూ అధికారులు తప్పించుకుంటున్నారు. పైసా పైసా కూడబెట్టుకుని కొనుగోలు చేసిన ప్లాటు చేజారిపోయి ఎంతో మంది రోడ్డున పడుతున్నారు. ప్లాట్ల అమ్మకాలు తగ్గిపోవడానికి ఇది కూడా ఒక కారణమని స్పష్టమవుతోంది. ఏ ప్లాటు డాక్యుమెంటు ఒరిజినల్‌దో, ఏది రెండో డాక్యుమెంటో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది.

వ్యాపారంలో స్తబ్దత..

ప్లాట్ల క్రయ విక్రయాల్లో ప్రస్తుతం స్తబ్దత నెలకొంది. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు కనిపించలేదని పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటున్నారు. ప్లాట్ల ధరలు భారీగా పెరగడం, వివాదాలు కూడా ఎక్కువ కావడంతో ప్లాట్ల దందాపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొంటున్నారు. కాగా ప్లాట్ల దందా పక్కకు వెళ్లగా, ఎకరాల చొప్పున వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు మాత్రం పెరిగినట్లు తెలుస్తోంది. డబ్బులు ఉన్న వాళ్లు ప్లాట్ల మీద పెట్టుబడి పెడితే పెద్దగా ధరలు పెరిగే అవకాశం లేదని గ్రహించి వ్యవసాయ భూముల బాటపట్టారు. చుట్టుపక్కల గ్రామాలు, దూర ప్రాంతాలకు సైతం వెళ్లి ఎకరాల కొద్దీ భూములు కొనుగోలు చేస్తున్నారు. ఎకరానికి రూ. 20లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు విలువ చేసే భూముల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలో ప్లాటు ధరలో పంట భూమి ఎకరం వస్తుండడంతో డబ్బులు ఉన్నవాళ్లు ఎకరాల కొద్దీ కొనుగోలు చేస్తున్నారు.

తొమ్మిదేళ్లలో అనేక రంగాల్లో అభివృద్ధి



2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్

- తెలంగాణ రన్‌కు అపూర్వ స్పందన
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువత

కామారెడ్డి క్రైం: తొమ్మిదేళ్లలో కామారెడ్డి జిల్లా అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించిందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. తెలంగాణ రన్‌ను ప్రభుత్వవిప్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు 2 కిలోమీటర్లు కొనసాగింది. అనంతరం ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణకు పరుగు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం నడక అలవాటు చేసుకోవాలన్నారు. యోగా, వ్యాయామం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. రన్‌లో చిన్నారులు, యువకులు, వృద్ధులు ఆసక్తిగా పాల్గొనడం సంతోషకరమన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో పోలీసుల పాత్ర చాలా గొప్పదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో వారి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ కుంభాల రవి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీ సురేష్, పట్టణ ఎస్‌హెచ్‌వో నరేశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీసులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు కోసం యువత కృషి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడలో తెలంగాణ 2కే రన్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: దేశ భవిష్యత్తు కోసం యువత పాటుపడుతోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బాన్సువాడలో ఏర్పాటు చేసిన తెలంగాణ 2కే రన్‌ను స్పీకర్ ప్రారంభించారు. స్థానిక భారత్ గార్డెన్ నుంచి మినీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. మినీ స్టేడియంలో స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రన్‌లో యువకులు పరిగెత్తుతుంటే దేశం పరిగెత్తుతున్నట్లు ఉందన్నారు. యువత అన్ని రంగాల్లో ముందుండన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, సీఐ మహేందర్‌రెడ్డి, రూరల్ సీఐ మురళి, ఎంపీపీ నీరజావెంకట్‌రాం రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, గంగాధర్ పాల్గొన్నారు.

మోగిన బడి గంట

- మొదటి రోజు హాజరైన విద్యార్థులు
- విద్యార్థులకు అందని పుస్తకాలు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కూర్చున్న విద్యార్థులు



కామారెడ్డి పట్టణంలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో పాఠశాలలు సోమవారం పునః ప్రారంభమయ్యాయి. మొదటిరోజు రావడంతో కొందరు విద్యార్థులు హుషారుగా సమయానికి ముందే హాజరయ్యారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయానికి హాజరుకాగా మరి కొందరు ఆలస్యంగా వచ్చారు. విద్యార్థులే పాఠశాలలో పనులు చేయాల్సి వచ్చింది. మొదటి రోజు కాకవడంతో బడులకు తక్కువ సంఖ్యలోనే విద్యార్థులు హాజరయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కానీ జిల్లాలో ఏ ఒక్క పాఠశాలలో కూడా పుస్తకాలను పంపిణీ చేయలేదు. అయితే ఈనెల 20న విద్యాదినోత్సవం సందర్భంగా పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో తెలంగాణ వైద్య, ఆరోగ్య దినోత్సవం వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వైద్యశాఖ అధికారులతో వైద్య ఆరోగ్య దినోత్సవం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యేల సహకారంతో వేడుకలు విజయవంతమయ్యే విధంగా చూడాలన్నారు.

సంక్షేమ ఫలాలు అందుకున్న లబ్ధిదారులు వేడుకలు హాజరయ్యే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, డాక్టర్లకు సన్మానం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, కామారెడ్డి, బాన్సువాడ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు విజయలక్ష్మి, శ్రీనివాస్‌ప్రసాద్, వైద్యుడు సంగీత్ కుమార్, చంద్రశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం బీఎల్‌వోలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో ఓటర్ల జాబితాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గస్థాయిలో వారానికి ఒకసారి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంటింటికి బీఎల్‌వోలు వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్లు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. తప్పులుంటే దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. మృతి చెందిన వ్యక్తుల పేర్లు ఉంటే తొలగించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం లోపు ఉండే విధంగా చూడాలన్నారు. ఒక వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో ఒకే చోట ఉండే విధంగా చూడాలని పేర్కొన్నారు. రెండు చోట్ల ఉంటే ఒకచోట తొలగించాలని కోరారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, శీను, రాజా గౌడ్ పాల్గొన్నారు.




దశాబ్ది కాంతులు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల వేళ కామారెడ్డి కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ కాంతులతో కార్యాలయం వెలుగులీనుతూ ఆకట్టుకుంటోంది. – సాక్షి, కామారెడ్డి

నిన్ను మరిచిపోలేమయ్యా..

- చనిపోయిన కుటుంబ సభ్యుడి విగ్రహంతో నూతన గృహ ప్రవేశం
- ఇంట్లో విగ్రహానికి నిత్య పూజలు





పబ్బ శేఖర్ విగ్రహంతో కుటుంబ సభ్యులు

భిక్కనూరు : భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన వ్యాపారి పబ్బ శేఖర్ (42) గత ఏడాది మార్చి 30న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎన్నో ఆశలతో, సుందరంగా నిర్మించిన ఇంట్లోకి ప్రవేశించకముందే ఆయన చనిపోవడంతో ఇల్లు అలాగే ఉండిపోయింది. ఏడాది తరువాత తేరుకున్న కుటుంబ సభ్యులు గృహప్రవేశం చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే రూ. 1.90 లక్షలు వెచ్చించి సిలికాన్‌తో శేఖర్ విగ్రహాన్ని ముంబైలో తయారు చేయించారు. నాలుగు రోజుల క్రితం శేఖర్ విగ్రహంతో గృహ ప్రవేశం చేశారు. ఇంట్లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్యం పూజలు చేస్తున్నారు. శేఖర్‌కు భార్య లత, ఇద్దరు కుమార్తెలు, సోదరుడు, తల్లిదండ్రులు ఉన్నారు. వారంతా శేఖర్ విగ్రహాన్ని చూసి ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. సిలికాన్ పదార్థం చర్మాన్ని పోలి ఉండటంతో విగ్రహాన్ని చూస్తే నిజంగా బతికి ఉన్నాడా ? అని అనిపిస్తోంది. శేఖర్ తండ్రి నాగరాజు మాట్లాడుతూ తన కొడుకు.. కుటుంబం కోసం ఎంతో కష్టపడ్డాడని, రోడ్డు ప్రమాదంలో చనిపోవడం తమకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందన్నాడు. గృహ ప్రవేశం రోజున శేఖర్ విగ్రహం సాక్షిగా కార్యక్రమాలు నిర్వహించుకున్నామని తెలిపారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



సదాశివనగర్: సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు బాగుందని కేంద్ర వైద్య బృందం ప్రతినిధులు నిర్మల్ నేగి, రీతకర్లా అన్నారు. సోమవారం పీహెచ్‌సీని వారు సందర్శించారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. ఓపీ వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో నాటిన మొక్కలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఆస్మా, సీహెచ్‌వో నాగరాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, నక్షత్ర, ఏఎన్‌ఎంలు ఉష, వకుల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం



మాచారెడ్డి: గ్యాస్ పొయ్యి మీద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఓ గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని కాకుల గుట్ట తండా పంచాయతీ పరిధిలో చెరువు కొమ్ము తండాలో చోటుచేసుకుంది. వివరాలు.. మాలోత్ సుమన్ భార్య సునీత సోమవారం ఉదయం వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో సునీత, ఏడాది పాప గుడిసెలో ఉన్నారు. మంటలు చెలరేగడంతో కేకలు వేస్తూ పాపను తీసుకుని బయటకు పరుగులు తీసింది. దీంతో తండా వాసులు మంటలను ఆర్పి వేశారు. ప్రమాదంలో రూ.10 వేల నగదు, వంట సామగ్రి, ఇతర వస్తువులు కాలిపోయాయి.

తెగుతున్న బంధాలు!

- ఆస్తి తగాదాలతో రక్త సంబంధీకుల మధ్య పెరుగుతున్న దూరం
- ఠాణాలు, కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు
- దాడులు చేసుకుంటున్న వైనం



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో గత నెల 25న ఆస్తుల విషయంలో గొడవతో అన్న తలపై తమ్ముడు సుత్తితో బాదాడు. పాల్వంచ మండలం ఇసాయిపేటలో ఆస్తి కోసం బతికున్న నానమ్మ చనిపోయిందని ఏకంగా మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించాడో వ్యక్తి.

పాల్వంచ మండలం ఎలుపుగొండలో భూమి పంపకాల్లో తేడాలు వచ్చాయని గత కొన్నేళ్లుగా తగవులాడిన అన్న దమ్ములు పలు మార్లు కుల పంచాయతీలో మాట్లాడుకున్నారు. చివరికి గతేడాది తమ్ముడు కిరాయి హంతకులకు సుపారి ఇచ్చి అన్నను హత్య చేయించి కటకటాల పాలయ్యాడు.

భూముల ధరలు పెరుగుతున్నట్టే వివాదాలు పెరుగుతున్నాయి. ఆస్తి విషయంలో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, తండ్రి, కొడుకుల మధ్య వైరం పెరుగుతోంది. ఒకరినొకరు కొట్టుకోవడం, చంపుకోడానికి వెనుకాడడం లేదు. గుంట భూమి కోసం పోలీస్ ఠాణాల చుట్టూ తిరుగుతూ దానిని అమ్మితే వచ్చే డబ్బుల కన్న రెట్టింపు ఖర్చు చేస్తున్నారు. కానీ రాజీ పడడం లేదు. కొన్ని కుటుంబాల్లో అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు గ్రామాల్లో ఉమ్మడిగా కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడ్డారు.

దూరం చేసుకుంటున్నారు..

ఆస్తి గొడవల నేపథ్యంలో ఒకరినొకరు తిట్టుకోవడం, కొట్టుకోవడం ద్వారా పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. అక్కడకు వెళ్లినా పోలీసులు గ్రామ పెద్దలు, కుల పెద్దలను కూర్చుండబెట్టుకుని మాట్లాడుకోమని సలహా ఇస్తున్నారు. ఎక్కడా పరిష్కారం కాని పరిస్థితుల్లో దాడులకు తెగబడుతున్నారు. హత్యలకూ వెనుకాడడం లేదు. కోర్టుల్లో కేసులు వేసుకుని ఏళ్ల తరబడిగా తిరుగుతున్నారు. ముఖ్యంగా ఆస్తి తగాదాల విషయంలో తిరగడానికి ఇతర ఖర్చులకు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ఎవరో ఒకరు కొంత తగ్గితే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. కానీ తగ్గేదేలే అన్నట్టుగా వ్యవహరిస్తూ రక్త సంబంధాలను దూరం చేసుకుంటున్నారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం



గెట్టు పంచాయితీలతో పాటు ఆస్తి తగాదాల విషయంలో అన్న దమ్ములతో మాట్లాడి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. కౌన్సెలింగ్ వల్ల చాలా కేసులు పరిష్కరించాం. ఇంకా కొన్ని కేసులు గ్రామాల్లోని పెద్ద మనుషుల చొరవతో పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తున్నాం.

– సంతోష్ కుమార్, ఎస్సై, మాచారెడ్డి

ప్రజావాణికి 71 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న నిజామాబాద్ కలెక్టర్, అధికారులు

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 71 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి, డీఆర్డీవో చందర్, ఆర్డీవో రవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

కంకర క్వారీని నిలిపేయాలి

డిచ్‌పల్లి మండలం సుద్దులం గ్రామంలో కంకర క్వారీతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వెంటనే క్వారీని నిలిపేయాలని గ్రామస్తుడు టి అనిల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. క్వారీ నుంచి వెలువడే దుమ్ము, ధూళి ద్వారా శ్వాసకోశ సమస్యలు, బ్లాస్టింగ్ వల్ల బోరుబావిలో మోటార్లు పడిపోతున్నాయని తెలిపారు.

నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలి

నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో జనాభా నాలుగు లక్షలకు మించిపోయిందని, ఈ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేషనల్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ సునీల్ జాదవ్ డిమాండ్‌చేశారు. ఈమేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు లక్ష్మీదేవి, అభితోష్, మహాసన్ బిన్ ఉమర్ బహమేద్, షేక్ ఫజల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మాక్లూర్: జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరుస్తామని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోర్గాం (కె) శివారులో నిజామాబాద్ ప్రెస్ భవనం నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మరువ లేనిదన్నారు. రాష్ట్రం సాధించిన అనంతరమే జర్నలిస్టులకు ఎంతో చేయాలని ఉన్నా సాధ్యపడలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనుక్షణం జర్నలిస్టుల సంక్షేమం గురించే ఆలోచన చేస్తారన్నారు. వారి ఆదేశానుసారమే అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించి ఇచ్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. అలాగే జర్నలిస్టుల కుటుంబాలకు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, రాజలింగం, సీనియర్ జర్నలిస్టు జమాల్‌పూర్ గణేశ్, బీఆర్‌ఎస్ నాయకులు ఎనుగంటి శ్రీనివాస్‌గౌడ్, మాస్త ప్రభాకర్, బడుగు సత్యం, ఆకుల రజినీష్ తదితరులు పాల్గొన్నారు.

మా బాబుకు చూపు ప్రసాదించరూ!

- మూడేళ్ల బాలుడికి కంటి సమస్య
- ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు



కంటి సమస్యతో బాధపడుతున్న బాబుతో తల్లిదండ్రులు

రెంజల్: తోటివారితో సరదాగా ఆడుకోవాల్సిన ఆ బాలుడు కంటి సమస్యతో ఇంటికే పరిమితమయ్యాడు. అందరితో కలిసి బడికి వెళ్లాల్సిన వయస్సులో కళ్లు కనిపించక ఇబ్బందులు పడుతున్నాడు. తమ బాబుకు వచ్చిన కష్టం చూసి నిత్యం మదన పడుతున్న తల్లిదండ్రులు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్నా.. అప్పులు చేసి వైద్యం చేయిస్తున్నారు. భారీ మొత్తంలో డబ్బు అవసరం కావడంతో దాతలు చేయూత అందించాలని వేడుకుంటున్నారు. వివరాలు.. రెంజల్ మండలం బోర్గాం గ్రామానికి చెందిన మంగళి ఆనంద్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన గ్రామంలో కులవృత్తి చేసుకుంటూ జీవిస్తాడు. ఆయన భార్య కూలీ పనులకు వెళ్తుంది. కరోనా సమయంలో ఆ దంపతులకు రెండో కుమారుడు దీక్షిత్ జన్మించాడు. కరోనా సమయంలో ఆస్పత్రుల్లో చేర్చుకోకపోవడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో భార్యను చేర్పించాడు. ఏడో నెలలోనే ఒక కేజీ బరువుతో బాబు జన్మించాడు. అతనికి సాధారణ బరువు తీసుక వచ్చేందుకు డాక్టర్లు ప్రయత్నించారు. దాంతో ఆ సమయంలో రూ. నాలుగు లక్షల వరకు ఖర్చయింది. డబ్బులు పోయినా బాబు బతికాడని వారు సంబరపడ్డారు. కానీ ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలువ లేదు. అదే ఆస్పత్రిలో రెండు నెలల తర్వాత జనరల్ చెకప్‌కు వెళ్లే బాబుకు కంటి సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించి హైద్రాబాద్‌కు రిఫర్ చేశారు. హైద్రాబాద్‌లోని ఎల్ వీ ప్రసాద్ ఆస్పత్రితో పాటు మరో రెండు ఆస్పత్రుల్లో చూయించినా సరైన ఫలితం లభించలేదు. బాబు వయసు పెరిగిన కొద్దీ నరాల సమస్య తొలగి కంటి చూపు వచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పి డాక్టర్లు టాబ్లెట్‌లు ఇచ్చారు. రెండు నెలల కిందట గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు ద్వారా స్థానిక వైద్యులను చూయించగా వారు నిజామాబద్‌కు రిఫర్ చేశారు. నిజామాబాద్ నుంచి హైద్రాబాద్‌లోని సరోజినిదేవి ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షలు చేసి శుక్లం ఆపరేషన్ నిర్వహించి కంటిపై ఉన్న తెల్లపొర తొలగించారు. బాబుకు మరో రెండు కంటి ఆపరేషన్‌లు చేయించాలని మెరుగైన ఆస్పత్రుల్లో చేయించాలని వైద్యులు సూచించడంతో నిరుపేదలైన తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కంటి చూపును అందించే మెరుగైన వైద్యం ఎక్కడ అందించాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైద్రాబాద్ నుంచి ఇంటికి చేరుకునేందుకు డబ్బులు లేక బస్టాండ్‌లో అడుక్కున్నామని వారు వాపోయారు. దాతలు ఆదుకుంటే చెన్నైలోని కంటి ఆస్పత్రికి తరలించి బాబును కాపాడుకుంటామని తండ్రి ఆనంద్ వేడుకుంటున్నాడు.

దాతలు సంప్రదించాల్సిన వివరాలు

ఫోన్ పే నంబర్ :
99635 62313 (ఆనంద్)
బ్యాంక్ అకౌంట్ నంబర్ :
79055050610
తెలంగాణ గ్రామీణ బ్యాంకు
ఐఎఫ్‌సీ కోడ్ : SBINO RRDCGB

బ్యాడ్మింటన్ పోటీలకు స్పందన



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మోపాల్: మోపాల్ గ్రామశివారులోగల ఫిట్‌నెస్ బ్యాడ్మింటన్ క్లబ్, నిజామాబాద్ బాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన క్రీడకు అనూహ్య స్పందన వచ్చింది. సుమారు 315 ఎంట్రీలు వచ్చాయని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వాసు, కేవీ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. అండర్ -11, 13, 15, 17, 19 విభాగాల్లో వివిధ కేటగిరీల క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్, నాందేడ్ జిల్లా నుంచి బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి క్రీడాకారుడికి సర్టిఫికెట్, మెమోంటో, విజేతలకు మెరిట్ సర్టిఫికెట్, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఆర్గనైజర్లు గంగాధర్ గౌడ్, శ్రీకాంత్, ఫిట్‌నెస్ క్లబ్ వ్యవస్థాపకుడు నవనీత్‌రెడ్డి, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోనేషియా అమ్మాయి.. సాలూర అబ్బాయి



బోధన్‌రూరల్: సాలూరకు చెందిన గోనె సావిత్రి గంగాధర్‌ల మూడో కుమారుడు నీలకంఠంకు ఇండోనేషియా దేశానికి చెందిన డీజెన్ డెబోరతో వివాహం జరిగింది. సోమవారం బోధన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివాహం వైభవంగా నిర్వహించారు. ఇండోనేషియా నుంచి అమ్మాయి కుటుంబ సభ్యులు వారం క్రితం సాలూర వచ్చి హిందూ సంప్రదాయం ప్రకారం పెద్దల సమక్షంలో పెండ్లి నిశ్చయించుకున్నారు. వీరిద్దరూ ఇజ్రాయిల్‌లో పీహెచ్‌డీ చదువుకునే సమయంలో ప్రేమించుకున్నారు. వివాహ వేడుకల్లో బుద్దె రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలురా షకీల్, ఎంపీటీసీ కండెల సవిత సంజీవ్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కల్లూర్‌లో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గంలో దేవాలయాల పునఃనిర్మాణానికి, అభివృద్ధికి రూ.150 కోట్లు కేటాయించినట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కోటగిరి మండలం కల్లూర్‌లో రూ.21 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రూ.9లక్షలతో నిర్మించిన గ్రామ దేవతల మందిరాల్లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆలయాలకు అవసరమగు నిధులు ఇస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి, వివిధ కమ్యూనిటీ హాళ్లకు రూ.రెండు కోట్లు కేటాయించామన్నారు. కల్లూర్–కొడిచర్ల బీటీ రోడ్డుకు రూ. 90లక్షలు మంజూరు చేశామన్నారు. సర్పంచ్ లక్ష్మీలింగప్ప, ఎంపీటీసీ సుజాత వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ శంకర్ పటేల్, ఎంపీపీ సునీతశ్రీనివాస్, ఆర్డీవో రాజేశ్వర్, బాన్సువాడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుద్రూర్‌లో గర్భగుడి ద్వారం ప్రతిష్ఠాపన

రుద్రూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామ మందిరం గర్భగుడి ద్వారం (గడప) ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై పూజలు చేశారు. ఎంపీపీ సుజాత నాగేందర్, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పత్తి రాము, పత్తి నవీన్, డాక్టర్ సాయిలు, వెంకటేశం సేట్, కెవీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పడి మాజీ కౌన్సిలర్ మృతి



అబ్దుల్ ముజీబ్

కామారెడ్డి టౌన్: ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మహ్మద్ అబ్దుల్ ముజీబ్(45) మృతి చెందాడు. పట్టణ సీఐ నరేష్ తెలిపిన వివరాలు.. టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ముజీబ్ ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి సుభాష్ టాకీస్ వెనకాల ఉన్న మురికి కాలువ కల్వర్టుపైన కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. సోమవారం తెల్లవారు జామున స్థానికుల సమచారంతో మృతదేహాన్ని గుర్తించిన్నట్లు సీఐ తెలిపారు. మృతుడి భార్య షహనాజ్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ముజీబ్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2015లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన ఎంఐఎం తరఫున కౌన్సిలర్‌గా గెలుపొందారు.

చికిత్స పొందుతూ అటవీ శాఖ అధికారి..

కామారెడ్డి టౌన్: పురుగుల పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ అటవీ శాఖ సెక్షన్ అధికారి సోమవారం మృతి చెందాడు. పట్టణ సీఐ నరేష్ తెలిపిన ప్రకారం.. కామారెడ్డి డివిజన్ అటవీ శాఖ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న నామాల వెంకటస్వామికి 2019లో నందిపేట్‌కు చెందిన సరితతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తల్లి నామాల లక్ష్మి, భార్య, పిల్లలతో కలిసి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ ఏడాది జనవరి 24న సరిత భర్తతో గొడవ పెట్టుకుని ఇద్దరు కూతుళ్లతో తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సరిత తల్లి లక్ష్మి, తమ్ముడు రజనీకాంత్ వెంకటస్వామిని మానసికంగా వేధిస్తున్నారు. ఇద్దరు కూతుళ్ల విషయంలో భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. పిల్లలపై బెంగతో మనోవేదనకు గురై ఈనెల 10న వెంకటస్వామి పురుగుల మందు తాగాడు. జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేట్ అశ్విని ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. తన కొడుకు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి నామాల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేశామని సీఐ తెలిపారు.

దివ్యాంగులకు స్వర్ణయుగం

- వచ్చే నెల నుంచి రూ.4,116 పింఛన్
- దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



ఆర్మూర్‌లో దివ్యాంగుడికి అన్నం తినిపిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్ : సీఎం కేసీఆర్ నాయకత్వంలోని రాష్ట్రంలో దివ్యాంగులకు స్వర్ణయుగం వచ్చిందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో ఆర్మూర్ నియోజకవర్గంలోని దివ్యాంగులతో ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రకటించినట్లుగా వచ్చే నెల నుంచి అర్హులైన దివ్యాంగులందరికీ ప్రస్తుతం వస్తున్న పింఛన్‌కు అదనంగా వెయ్యి పెరిగి రూ.4,116 పింఛన్ వస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి వేలాదిగా తరలివచ్చిన దివ్యాంగులకు భోజన సదుపాయం కల్పించగా పలువురు దివ్యాంగులకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి స్వయంగా అన్నం తినిపించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తండ్రిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఆస్తి విషయంలో తండ్రి, తమ్ముడిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. సోమవారం పెద్దపుల్ల నిషాంత్ అనే యువకుడు ఆస్తి పంపకం విషయంలో తన తండ్రి నారాయణ, చిన్న తమ్ముడు నితీష్‌పై కర్రతో దాడి చేసి గాయపరిచాడని ఎస్సై తెలిపారు. నారాయణ ఫిర్యాదు మేరకు నిషాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.